
# పరీక్షట్టు

—సింగలునేని నారాయణ

‘‘మీరిట్ల పరీక్షలు జరిపితే మా పిల్లోల్ల గతి ఏం గావల్ల సార్’’

ఆఫీసు రూమ్‌లోకి దూసుకువచ్చిన గుంపులో నుండి వినిపించిన ఈ మాటకు తలెత్తి వారి వేపు చూశాడు హెడ్మాస్టర్.




స్కూల్ అటెండర్ వారిస్తున్నా వినకుండా నేరుగా హెడ్మాస్టర్ ముందు నిలబడ్డారు వాళ్ళు. వాళ్లంతా ఆవేశంగా, ఆక్రోశంగా వున్నట్టు గమనించాడు హెడ్మాస్టర్. ఆయన శాంతంగా వాళ్లకేసి చూస్తూ, ‘కూచోండి’ అంటూ బెంచీ చూపించాడు.

వాళ్లెవరూ కూచోలేదు. ఏడెనిమిది మంది దాకా వున్నారు వాళ్లు — ముప్పయి మొదలుకొని యాభై దాకా వయసున్న వాళ్లున్నారు వాళ్లలో. వాళ్ల ముఖాలలో అసహనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

‘‘మీరింత స్ట్రిక్ట్‌గా పరీక్షలు జరపటం న్యాయం కాదు సార్! ఇట్లయితే మా పిల్లోల్లంతా ఫేలయిపోతారు’’ అన్నాడు వాళ్లలో అంతో యింతో చదువుకున్న వాడిలా కనిపిస్తున్న ఒకరు.

పరిస్థితి అర్థమయింది హెడ్మాస్టర్‌కు. ఆయన కుర్చీలోంచి లేచి నిలబడి ‘‘చూడండప్పా! పరీక్షలు స్ట్రిక్ట్‌గా జరపటం నా కర్తవ్యం! నా పని నన్ను చేయవద్దంటారా?’’ అన్నాడు నెమ్మదిగానే.

‘‘నిజమే సార్! మీరు కూడా కొంచెం చూసుకొని పోవల్ల! బొత్తిగా కాపీలు జరక్కపోతే అందరూ ఫేలయిపోతారు. ఏం బాగుంటుంది’’ అని ఒకరన్నారు. ఆయన తెల్లటి పాలిస్టర్ బట్టల్లో మెరిసిపోతున్నాడు. వచ్చిన ఆ గుంపుకు నాయకత్వం వహిస్తున్న వాడిలా వున్నాడు.

‘‘కాపీలు కొట్టిస్తే, విద్యా ప్రమాణాలు పడిపోతాయండీ’’ అన్నాడు హెడ్మాస్టర్ వాళ్లకు నచ్చచెప్పే ధోరణిలో.

అంత బరువైన మాట వినటం పాపం వాళ్లకదే మొదటిసారి. తమ పిల్లవాడు వున్న తరగతి నుండీ పై తరగతికి వెళ్లటమే వాళ్లకు తెలిసిన ప్రమాణం! ఆ మాటకొస్తే ఆ హెడ్మాస్టర్‌కు మాత్రం ఏం తెలుసు? పరీక్షల ప్రమాణాలనే విద్యా ప్రమాణాలుగా భావిస్తున్న అసంఖ్యాక అధికారులలో ఆయనా ఒకరు!

"ఎవురికి కావల్ల సార్ ఆ ప్రమాణాలు? మాకు మా పిల్లోల్లు పాస్ కావల్ల అంతే" డిమాండ్ చేస్తున్నట్టు ధీమాగా అడిగారు ఒకరు — ఆ మాట తన్ను ఎగసెక్కెం చేస్తున్నట్టు అనిపించింది హెడ్మాష్టర్‌కి.

"మీ అయ్యవార్లంతా రోజా టౌన్ నుండీ వస్తారు. పోతారు. వూర్లో ఒక్కరు కాపుర ముండరు. మీ యిష్టం మీదయిపోయింది. పిల్లోల్లకు సరిగ్గా పాటాలు చెప్తా వుండారా మీరు? అటు సరిగ్గా పాటాలూ చెప్పకుండా, యిట్ల కాపీలు కొట్టేకుండా వుంటే ఎట్ల సార్!" నిగ్గదీస్తున్నట్టు ప్రశ్నించారింకొకరు.

ఆ హైస్కూల్ ఉపాధ్యాయులెవ్వరూ స్థానికంగా కాపురం లేని మాట నిజమే! ఆ స్కూల్ ఉపాధ్యాయులంతా అక్కడికి పది మైళ్ల దూరంలో వున్న 'టౌన్' నుండీ రోజా వస్తారు. రోడ్డులో బస్సు దిగి ఒక కిలోమీటరు నడిచి స్కూల్‌కి చేరుకుంటారు వాళ్లు. హెడ్మాష్టర్ కూడా అంతే — తమ మీద పెత్తనం చెలాయిస్తున్నట్టు మాట్లాడటానికి వీళ్లకిదొక అవకాశం అనుకున్నాడు హెడ్మాష్టర్.

"కాపీరైటు ఈ పొద్దు మాకు కొత్తేం కాదు సార్! మీరు ఈ స్కూల్‌కు కొత్తగా వచ్చి లేనిపోని పద్ధతులన్నీ పెడతావుండారు" అని ఆరోపించాడు మరో వ్యక్తి.

ఇలా తలా ఒక మాట బెదిరించేసరికి హెడ్మాష్టర్‌కు బాగా కోపం వచ్చి, "ఏమిటండీ మీ బెదిరింపులు! మా పని మమ్మల్ని చేసుకోనివ్వండి — దయచేసి మీరంతా బయటికి వెళ్లండి — ఇంకో అరగంటలో పరీక్షలు ప్రారంభమవుతాయి. ఎవరూ ఇక్కడ వుండటానికి వీల్లేదు — వెళ్లండి" అంటూ గట్టిగా గద్దించాడు. అటెండర్ని పిలిచి అందర్నీ బయటికి పంపించమని ఆదేశించాడు. వచ్చిన వాళ్లంతా ఆయన్ను శత్రువులా చూస్తూ గొణుక్కుంటూ చరచరా బయటికి వెళ్లిపోయారు.

హెడ్మాష్టర్ ఆఫీసు రూమ్ నుండీ బయటికి వచ్చి వరండాలో అటూ యిటూ పచార్లు చేస్తూ స్కూల్ చుట్టూ మూగివున్న జనాన్ని చూస్తూ నిల్చుండిపోయాడు.

ఏడవ తరగతి 'పబ్లిక్' పరీక్షలు జరుగుతున్నాయి ఆ స్కూల్లో — సంవత్సరం చివర్లో జరిగే పరీక్షలు.


ఆ రోజు ఇంగ్లీషు పరీక్ష — అంతకు ముందు రోజు తెలుగు పరీక్ష జరిగింది.

ఆ స్కూల్ విద్యార్థులు నలభై మంది కాక, అక్కడికి దగ్గర్లో వున్న అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు మరో ముప్పయి మంది కూడా పరీక్షలు రాస్తారక్కడ.

పరీక్షలురాసేవాళ్లు డెబ్బయి మందే అయినా, ఆ స్కూల్ చుట్టూ మూగిన జనం రెండు వందల మంది దాకా వున్నారు. ఆ వూరి వాళ్లకు అదో సరదా! ఏడవ తరగతి పరీక్షలంటే వాళ్లకు అదో యుద్ధం లాంటిది. అదో జాతర లాంటిది — అదో తిరణాల లాంటిది. పనులన్నీ మాని స్కూలు చుట్టూ మూగుతారు వాళ్లు. అలా మూగిన వాళ్లలో లోపల పరీక్షలు రాస్తున్న విద్యార్థుల తండ్రులూ, అన్నలూ, బంధువులూ మాత్రమే కాక, వినోదం చూద్దానికా అన్నట్టు మూగేవాళ్లు కూడా వుంటారు. లోపల పరీక్షలు రాస్తున్న వాళ్లకు అవసరమైన సహాయం అందించటానికి, అన్ని హంగులతో వాళ్లక్కడ సిద్ధమవుతారు. పరీక్ష ప్రారంభమైన అరగంటకల్లా, ఏదో ఒక రూపంలో ప్రశ్న పత్రమో, ప్రశ్నలో బయటకు వస్తాయి. ఇక ఆ ప్రశ్నలకు జవాబులు తయారు చేయటం, గైడ్లలో పేపర్లు చించడం, ఇలా ప్రారంభమవుతుంది వాళ్ల సాయం. స్కూల్ వెనకాల చేరి, జవాబుల్ని వుండలు వుండలుగా చుట్టి కిటికీల గుండా గదుల్లోకి విసిరేస్తారు. చిట్టీలు చెప్పించమని ఉపాధ్యాయుల్ని బెదిరిస్తారు. పరీక్ష పూర్తయ్యే దాకా ఒకటే సందడి. ఒకటే రణగొణ — చిన్న సైజు యుద్ధ రంగంలా తయారవుతుంది ఆ ప్రాంతమంతా. ఇదంతా ఒకనాటి పద్ధతి కాదు — ఒక సంవత్సరం పద్ధతి కాదు — అక్కడ ఏళ్ల తరబడి సాగుతున్న సంప్రదాయ వారసత్వమది!

పరీక్షలు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు ఆ స్కూల్ ఉపాధ్యాయులే! పాపం! వాళ్లంతా నిమిత్తమాత్రులే! వాళ్లు చేతులెత్తి నమస్కరించినా ఆ వూరి వాళ్లు వినరు — "మేమే అవసరమైన సాయం చేస్తాం. మీరు వెళ్లండయ్యా" అన్నా వాళ్లు అంగీకరించరు. ఎక్కడ తమవాడు ఫెయిల్ అవుతాడో అని, అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు వాళ్లు! ఆ స్కూల్ హెడ్మాష్టర్ ఈ దాడిని భరించలేక, చేతులెత్తి నిస్సహాయత ప్రకటిస్తాడు. పరీక్షలు పూర్తవుతాయి. ఏ నలుగురైదుగురో తప్ప అందరూ పాసవుతారు. ఇదీ అనూచానంగా జరుగుతున్న తంతు!

అయితే, ఈ సంవత్సరం మొదటి రోజు తెలుగు పరీక్ష జరిగినప్పుడే, ఇన్నాళ్లూ అవిచ్ఛిన్నంగా సాగుతూ వచ్చిన ఈ సంప్రదాయం, ఆ వూరి వాళ్లు వూహించని విధంగా ముక్కలు చెక్కలై పోయింది. అలా ఆ సంప్రదాయాన్ని ముక్కలు చెక్కలు చేసినవాడు, ఆ స్కూల్‌కు రెండు నెలల క్రితం ప్రమోషన్ మీద వచ్చిన



కొత్త హెడ్మాస్టర్ వెంకటపతి!

వెంకటపతి ఆ స్కూల్ హెడ్మాస్టర్‌గా ఛార్జ్ తీసుకున్న వారం రోజులకే, స్కూల్ వాతావరణాన్నీ, ఆ ఊరి ప్రజల మనస్తత్వాన్నీ సునాయాసంగా పసిగట్టేశాడు. ఆ స్కూల్లో విద్యా ప్రమాణాలు మరీ హీనంగా దిగజారిపోవటానికి కారణాలు అన్వేషించాడు. పక్క ఊళ్లలో తొంభై శాతం పైగా ఫలితాలు వస్తున్నా ఆ స్కూల్లో, పదవ తరగతిలో పట్టుమని పది శాతం కూడా ఫలితాలు రాకపోవటానికి మూలకారణం ఎక్కడుందో చిటికెలో గ్రహించేశాడు. ఆరో తరగతి చేరినవాడు, అడ్డూ ఆపూ లేకుండా పదో తరగతి దాకా వస్తే ఆ స్కూల్లో చదువులేముంటాయి? ఫలితాలేముంటాయి? ఇక యిలా జరుగకూడదు అనుకున్నాడు.

వెంకటపతి అసిస్టెంట్‌గా పనిచేసిన రోజుల్లో మంచి ఉపాధ్యాయుడిగానే కాక, స్ట్రిక్ట్ టీచర్గా కూడా పేరు తెచ్చుకున్నాడు. విద్యా ప్రమాణాలు కాపాడటం పట్ల అంతో యింతో చిత్తశుద్ధీ, ఆచరణా వున్నవాడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

> ### పునరపి దోషం
>
> తల్లి: (బుజ్జిగాణ్ణి ప్రశ్నిస్తూ) రాత్రి పడుకునేటప్పుడు, ఆ రోజు చేసిన తప్పుల గురించి ఆలోచించాలి నాన్నా!
>
> బుజ్జిగాడు: మరి రేపొద్దున నిద్ర నుంచి లేచినప్పుడు?
>
> పొద్దున్న లేవగానే ఆ రోజు చేయబోయే తప్పుల గురించి ఒక్కొక్కటి ఆలోచించాలి బుజ్జీ.
>
> రామం[illegible],
>
> బెంగుళూరు

ఏడవ తరగతి పరీక్షలు ప్రారంభం కావటానికి నాలుగు రోజుల ముందు, తోటి ఉపాధ్యాయులతో ఒక సమావేశం ఏర్పాటుచేశాడు. పరీక్షల నిర్వహణ గురించి చర్చించాడు. పరీక్షల్ని 'స్ట్రిక్ట్'గా నిర్వహించాలనీ, అందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలనీ అర్థించాడు. కొందరు ఉపాధ్యాయులు ఆ గ్రామ ప్రజల పద్ధతుల్నీ, ముఠాతత్వాన్నీ వివరించి చెప్పి, 'ఈ ఊళ్ళో చాలా కష్టం సార్' అన్నారు. 'కొన్ని విలువల కోసం కొంత కష్టం అనుభవించినా తప్పులేదు' అని నచ్చ చెప్పాడు హెడ్మాస్టర్.

"కష్టాలు అనుభవించటం మాకు కొత్త కాదు — కానీ మనం పడే కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరవుతున్నదే అనే మా బాధ! మనం కష్టపడి, ఎన్నెన్ని ఇబ్బందులు ఎదుర్కొని పరీక్షలు స్ట్రిక్ట్‌గానే నిర్వహించామనుకోండి — ఇక విద్యార్థుల సంబంధీకులు అంతటితో ఆగుతారా? 'స్పాట్ వాల్యుయేషన్ సెంటరు' చుట్టూ తిరిగి తమ పిల్లలు పాసయేలా ఏర్పాట్లు చేసుకుంటారు. అక్కడా కుదరలేదనుకోండి. మళ్లీ 'రీ ఎగ్జామినేషన్స్' అంటూ ఒకటి ఏడ్చి చచ్చాయిగా — ఆ పరీక్షల్లో తమ వాడు పాసయ్యేలా నానా గడ్డీ కరుస్తారు. చివరకు మనకు మిగిలేదల్లా నిందలూ, కక్షలూ మాత్రమే. ఎందుకు లేనిపోని గొడవలు తెచ్చుకోవటం" అని ఒక ఉపాధ్యాయుడు నిర్మొహమాటంగా చెప్పేశాడు పరిస్థితినంతా —


గౌతమబుద్ధ రెసిడెన్షియల్ కళాశాల

లక్ష్మీపురం, గుంటూరు-7 ❋ ఫోన్: 32192

గౌతమబుద్ధ రెసిడెన్షియల్ కోచింగ్ సెంటర్

- 20 సం॥లకు పైగా అనుభవముండి, పేరు ప్రతిష్ఠలు గల అధ్యాపకులచే బోధన.
- ఆడియో, వీడియో సౌకర్యములతో విద్యార్థులకు బోధన.
- ఎంట్రన్స్ దృష్టితో సూక్ష్మ విషయాలను బోధించుట.
- నూతన పరీక్షా విధానమునకు, ఎంసెట్‌కు అనుగుణంగా విద్యాబోధన.
- గుంటూరులో పేరుప్రతిష్ఠలు కలిగి, ఎన్నో వేలమంది ఇంజనీర్లు, డాక్టర్లను తయారుచేసి, ఎంతో అనుభవము గల అధ్యాపకులచే విద్యాబోధన మా ప్రత్యేకత.

ఇంటర్ మీడియట్

M.P.C. & Bi.P.C.

(ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో)

—డైరెక్టర్—

SUJI

'EYE ADS'

"మనకు బాగా గుర్తు సార్! ఏడవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభించిన తొలి రోజుల్లో, ఇన్విజిలేషన్‌కుగాను, ఇతర స్కూళ్ళ ఉపాధ్యాయులను నియమించేవారు. పరీక్షలు అన్ని స్కూళ్ళ లోనూ స్ట్రిక్ట్‌గా జరిగేవి. బాగా చదువుకున్న విద్యార్థులే పాసయేవారు. రిజల్ట్సు చాలా తక్కువగా వచ్చేవి. ఆ తర్వాత ప్రభుత్వం ఏ స్కూల్ ఉపాధ్యాయులను, ఆ స్కూల్లోనే ఇన్విజిలేషన్‌కు నియమించుకోమని ఉత్తర్వులు జారీ చేసింది. రిజల్ట్సును పెంచుకోమని పరోక్షంగా సూచిస్తూ ఈ పని చేసిందన్న మాట ప్రభుత్వం. ఇంకా ఫెయిలయిన వారెవరైనా వుంటే, వాళ్ళ కోసం రీ ఎగ్జామినేషన్స్ నిర్వహిస్తోంది యిప్పుడు—విద్యార్థులు కూడా ఈ పద్ధతికి బాగా అలవాటయిపోయారు. ఇక విద్యార్థుల తండ్రులు కూడా తమ వాడు ఎలాగో పాసయితే చాలు అన్న ధోరణికి వచ్చేశారు. ఈ డొంకతిరుగుడు కంటే అసలు ఏడవ తరగతిలో కూడా డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేస్తే మేలు కదా! ఈ పరీక్షల వ్యవహారంలో చివరకు మనం ఫూల్స్ అయిపోతున్నాం" అని అంగలార్చాడు మరో ఉపాధ్యాయుడు.

అంతా విని హెడ్మాస్టర్ "నిజమేనండీ! ఎక్కడెక్కడో ఏదో జరుగుతుందని, ముందే ఆ బురదను మన నెత్తిన చల్లుకుందామంటారా? మన కర్తవ్యం మనం నిర్వహిద్దాం" అంటూ కర్తవ్య దీక్షకు నడుం బిగించేశాడు.

"మనం కనీసం ప్రతి సబ్జక్ట్‌లోనూ కొన్ని బిట్లయినా చెప్పేలా చూద్దాం. బొత్తిగా సాయం జరక్కపోతే మన స్కూల్లో నలుగురు కూడా గట్టెక్కరు" అని సూచించాడు యింకో ఉపాధ్యాయుడు.

హెడ్మాస్టర్ ఆ సూచనను కూడా తోసిపుచ్చేశాడు. ఇలా అన్ని చర్చలూ పూర్తయాక, పరీక్షలు స్ట్రిక్ట్‌గా నిర్వహించేందుకే రంగం సిద్ధమయింది.

మొదటి రోజు తెలుగు పరీక్ష అనుకున్న విధంగానే జరిగింది. హెడ్మాస్టర్ అన్ని రూముల్నీ స్వయంగా పర్యవేక్షించాడు. అన్ని కిటికీల తలుపుల్నీ మూయించేశాడు. ఏ చిన్న పేపరూ గదిలోకి చొరబడకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు. ప్రశ్న పత్రంగానీ, ప్రశ్నలుగానీ బయటికి వెళ్ళకుండా అప్రమత్తంగా వ్యవహరించాడు. స్కూలు చుట్టూ మూగిన జనం, పరిస్థితిని అర్థం చేసుకుని హాహాకారాలు చేశారు.

## ప్రెసిడెంట్ వ్యాకరణ దోషం

వాషింగ్‌టన్ డి.సి. వార్తాపత్రికలో వచ్చిన ఒక ఉదంతం- జార్జ్‌బుష్ తానుచేసిన తప్పులు గ్రహించి సరి దిద్దుకునే రాష్ట్రపతిగా చరిత్రలో లిఖించబడాలి. మెసాచుసెట్స్ అవెన్యూలోని భారత రాయబారి కార్యాలయంలో, రాజీవ్ గాంధీ హత్య సందర్భంగా సంతాపం తెలియజేయడానికి వెళ్ళిన జార్జ్ బుష్ 'సంతాప పుస్తకం'లో ఇలా రాశారు-
**'With respect to a great leader. With love from Barbara and I for, for a Great friend! My respects for India's people. George Bush.'** ఇలా రాసి వచ్చి, అంబాసిడర్ అబిద్ హుస్సేన్‌తో మాట్లాడుతూ, తను రాసిన దాంట్లోని వ్యాకరణ దోషం తెలుసుకుని, తన సహాయకుడు బ్రెంట్ స్కౌక్రోఫ్ట్‌ని తన తప్పు గురించి అడిగారు. అతను అవునని అస్పష్టంగా తల ఊపాడు. వెంటనే బుష్ వెనక్కి వెళ్ళి, దానిలో **'I'** అన్నది కొట్టేసి **'me'** అని రాశారు.

- ఎస్. లక్ష్మీవిద్య, మద్రాస్

తెలుగు పరీక్ష జరుగుతూండగానే కొంతమంది దౌర్జన్యంగా స్కూల్లోకి ప్రవేశించారు. హెడ్మాస్టర్‌తో పోట్లాట పెట్టుకున్నారు. హెడ్మాస్టర్ వాళ్ళందరినీ బలవంతంగా బయటకు పంపించేశాడు. "మీ యిష్టం వచ్చింది మీరు చేసుకోండి. మాకు అడ్డు రాకండి" అని కరాకండీగా చెప్పేశాడు.

తెలుగు పరీక్ష మరీ అంత కష్టమైంది కాదు గాబట్టి ఆ రోజు వూళ్ళో వాళ్ళు కొంత సర్దుకుపోయారు.

కాని ఈ రోజు అలా కాదు. ఇంగ్లీషు పరీక్ష విద్యార్థుల భవితవ్యాన్ని అటో యిటో తేల్చే పరీక్ష

అంతకు ముందు రోజు జరిగిన తెలుగు పరీక్ష అనుభవంతో వూళ్ళో వాళ్ళు తగిన జాగ్రత్తలు తీసుకోవాలనుకున్నారు. ఆ రాత్రికి రాత్రే స్కూల్లోకి వెళ్ళి, కిటికీలకున్న బోల్టులూ, నట్టులూ, గడియలూ అన్నీ నిర్మూలించేశారు. కొన్ని కిటికీల రెక్కలు వూడపెరికేశారు కూడా.

ఆ రోజు పొద్దున పరీక్ష ప్రారంభం కావటానికి ముందు ఏడెనిమిది మందిని ఒక గుంపుగా హెడ్మాస్టర్ దగ్గరకు రాయబారం పంపించారు గ్రామస్తులు. అది బెడిసికొట్టడంతో వాళ్ళు కాళ్ళీడ్చుకుంటూ స్కూల్ బయటకు వచ్చేశారు.

వరండాల్లో అటూ యిటూ తిరుగుతున్న హెడ్మాస్టర్ దగ్గరకు అటెండర్ సరసరా వచ్చి "కిటికీల గొళ్ళన్నీ పీకి పారేసినారు సార్" అన్నాడు ఆందోళనగా—అన్ని క్లాసు రూముల్లోనూ కిటికీలకు పట్టిన దౌర్భాగ్యాన్ని కళ్ళరా చూసి నివ్వెరపోయాడు హెడ్మాస్టర్. 'ఔరా' అనుకున్నాడు. ఉపాధ్యాయులందర్నీ పిలిచి, "ఏ చిన్న పేపరు కిటికీల నుండీ లోపలకు వచ్చినా వెంటనే తీసివెయ్యండి. ఇలా మనం వూళ్ళో వాళ్ళకు భయపడితే పరీక్షలే కాదు—రేపు స్కూల్‌కు కూడా సరిగా రాలేం" అని కర్తవ్య బోధ చేశాడు. ఉపాధ్యాయులందరూ సహకరించే ధోరణిలో తలలూపారు.

ఆ రోజు సరిగ్గా ఎనిమిది గంటలకు ఇంగ్లీషు పరీక్ష ప్రారంభమయింది. స్కూల్ చుట్టూ మూగిన జనం హెడ్మాస్టర్‌ను శాపనార్థాలు పెడుతూ ఆగ్రహంతో చిందులు తొక్కుతున్నారు. "హెడ్మాస్టర్ వ్యూహాన్ని ప్రతిఘటించటం ఎలా" అని గుంపులు గుంపులు చేరి చర్చల్లో మునిగిపోయారు. అక్కడికీ కొందరు మాజీ విద్యార్థులు తాము ముఖ్యమనుకున్న ప్రశ్నలకు, జవాబులను గైడ్ల నుండి చించి వుండలు చేసి కిటికీల గుండా లోపలకు విసిరేందుకు ప్రయత్నాలు చేయసాగారు. కొందరు కిటికీల దగ్గర చేరి గదుల్లో వున్న ఉపాధ్యాయుల్ని బెదిరించటం కూడా చేశారు. హెడ్మాస్టర్ ప్రతి గదినీ అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ, ఉపాధ్యాయులకు తగిన సూచనలిస్తూ, జాగ్రత్తలు తీసుకోసాగాడు.

ఒక గంట గడచి పోయింది. గేటు ముందు ఈలలూ, అరుపులూ—'హెడ్మాస్టర్ డౌన్ డౌన్' అంటూన్న కుర్రకారు నినాదాలతో వాతావరణమంతా హోరెత్తి పోతూంది.

ఇంతలో అకస్మాత్తుగా ఒక పోలీసు వ్యాన్ స్పీడుగా వచ్చేసింది అక్కడికి—స్కూల్ చుట్టూ మూగి వున్న జనం 'ఏమిటా' అని చూస్తుండగానే వాన్ నుండి ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఆరుగురు పోలీసులు, చకచకా దిగి, చేతిలోని లాఠీ కర్రలతో వున్నపళంగా చేతికందిన మనుషులందర్నీ బాదటం మొదలుపెట్టారు. ఊహించని ఈ పరిణామానికి జనం బిత్తరపోయి లాఠీ దెబ్బలను తప్పించుకోలేక హాహాకారాలు చేస్తూ పరుగు లంకించుకున్నారు.

పరుగెత్తుతున్న వాళ్ళను వెంటాడి పోలీసులు చితక బాదసాగారు. లాఠీల శబ్దాలూ, పోలీసుల హుంకరింపులూ, జనాల ఆర్తనాదంతో ఒక్క క్షణంలో ఆ ప్రాంతమంతా యుద్ధ భూమిలా తయారయింది. ఒకరిద్దరు వూరి పెద్దలు పోలీసుల దగ్గరకు వచ్చి, ఏదో చెప్పబోయేసరికి వాళ్ళపైన కూడా లాఠీలు దాడి చేశాయి. అయిదంటే అయిదే నిమిషాల్లో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యం అయిపోయింది. జనం యిళ్ళలోకి దూరి తలుపులు బిగించేసుకున్నారు భయంతోనూ, బాధతోనూ.

నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా మారిన స్కూల్ కాంపౌండ్ చుట్టూ పోలీసులు గస్తీ తిరుగుతూండగా, సబ్ ఇన్‌స్పెక్టర్ నేరుగా స్కూల్లోకి వెళ్ళాడు.

స్కూల్లో వున్న ఉపాధ్యాయులు, బయట జరుగుతున్న బీభత్సాన్ని చూసి నివ్వెరపోయారు. ఎందుకిలా జరిగిందో, అసలు పోలీసులు ఎందుకొచ్చారో, వచ్చిన పోలీసులు అంత సడన్‌గా జనాన్ని లాఠీలతో ఎందుకు బాదారో, వాళ్ళకంతా అయోమయంగా వుంది. అయోమయం లేనిది ఒక్క హెడ్మాస్టర్‌కే. ఆయన అంతకు ముందు రోజు సాయంత్రం తమ స్కూల్లో పరీక్షల నిర్వహణకు జనం అడ్డు పడుతున్నారని, పోలీసు స్టేషన్లో ఒక చిన్న రిపోర్టు యిచ్చి వచ్చాడు. అలాగే డి.ఇ. ఓ. గారిని పర్సనల్‌గా కలిసి, విషయం విన్నవించి వచ్చాడు. దాని ఫలితమే పోలీసుల రాక అని ఆయనకు అర్థమయింది.

పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులో తెచ్చినందుకు హెడ్మాస్టర్ మనసులో సంతోషించినా, జనాన్ని నిర్దాక్షిణ్యంగా బాదినందుకు కించిత్ మథనపడ్డాడు. "నా కర్తవ్యం నేను నిర్వర్తించాను. వాళ్ళ కర్తవ్యం వాళ్ళు నిర్వర్తించారు" అనుకొని మళ్ళీ సమాధాన పడ్డాడు.

స్కూలు చుట్టూ ప్రశాంత వాతావరణం ఏర్పడ్డ తర్వాత సబ్ ఇన్‌స్పెక్టర్ హెడ్మాస్టర్‌ను కలిసి 'డోంట్ వర్రీ' అని అభయ మిచ్చాడు.

పరీక్షలు మరింత స్ట్రిక్ట్‌గా జరిగాయి.

పదిన్నరకు పరీక్షలు పూర్తయ్యాయి.

విద్యార్థులు వెళ్ళిపోవటంతో స్కూల్లో కూడా నిశ్శబ్దం అలుముకొంది.

హెడ్మాస్టర్ పోలీసుల్ని పిలిపించి, లాఠీ ఛార్జీ చేయించాడన్న విషయం క్షణంలో గ్రామమంతా అల్లుకు పోయింది. ఊరంతా ఈ సంఘటనతో అట్టుడికి పోయింది. "మా వూళ్ళో, మేము కట్టించిన స్కూల్లో పనిచేసేవాడు మా వూరి జనాలపైనే పోలీసుల్ని ఉసిగొలిపి కొట్టిస్తాడా" అని వూరంతా ఆగ్రహంతో వూగిపోయింది.

పరీక్షలు కాగానే ఉపాధ్యాయులంతా పోలీస్ వాన్‌లోనే టౌన్‌కు వెళ్ళిపోయారు హెడ్మాస్టర్తో సహా.

పోలీసులు వెళ్ళిపోగానే వూరంతా స్కూల్ ముందు మూగింది. లాఠీ దెబ్బలు తిన్నవాళ్ళు అవమానంతోను ఆక్రోశంతోను వుడికిపోతున్నారు. జరిగిన విషయంపై తర్జన భర్జనలు సాగాయి. పరిస్థితి యింత చేయి జారిన తర్వాత దీని అంతే మిటో చూడాలన్నారు చాలా మంది.

ఆ తర్వాత జరిగిన పరీక్షల్ని పోలీసుల సాయం లేకుండా జరపడం సాధ్యం కాదనిపించింది హెడ్మాస్టర్‌కు. రోజూ యిద్దరు కానిస్టేబుల్స్‌ను వెంట బెట్టుకుని వచ్చేవాడాయన.

ఇలా మిగిలిన నాలుగు పరీక్షలను జరిపించాడు హెడ్మాస్టర్. ఆ నాలుగు రోజులూ స్కూల్ దగ్గరకు జనం అసలు రాలేదు. ఒక మహా ప్రళయం ముందు ప్రశాంతతలా స్కూలు చుట్టూ నిశ్శబ్దం నిండుకుంది.

సరిగ్గా వారం రోజుల తర్వాత—

ఉదయం పది గంటలు కావస్తోంది. ఎండ చాలా వేడిగా వుంది.

రోడ్డు మీద బస్సు దిగి మట్టి బాటపై వేగంగా నడుస్తున్నారు నలుగురు ఉపాధ్యాయులు. మామూలుగా వచ్చే బస్ మిస్ కావటంతో ఆరోజు వాళ్ళు ఆలస్యంగా దిగారు. అందరికంటే రోజూ ముందుగా స్కూల్‌కు వెళ్ళేది హెడ్మాస్టర్లే! అందుకే ఆలస్యం అవుతుందేమోనని తొందర తొందరగా నడుస్తున్నారు వాళ్ళు—

అరకిలో మీటరు నడిచిం తర్వాత రోడ్డు మలుపు తిరిగే చోట జనం మూగివున్న దృశ్యం— మూగివున్న వాళ్ళు ఏడెనిమిది మంది దాకా వున్నారు. రోడ్డు పక్కన వున్న ఒక కంప చెట్టు దగ్గరగా వాళ్ళు వలయాకారంగా మూగి వున్నారు. మూగి ముందుకు తొంగి తొంగి చూస్తున్నారు. చూస్తూ ఒకరితో ఒకరు చేతులు వూపుకుంటూ ఏదో చెప్పుకుంటున్నారు.

పది గజాల దూరంలోనే ఈ గుంపును చూసిన ఉపాధ్యాయులు 'ఏమిటా' అని ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ మరింత వేగంగా అక్కడికి చేరుకున్నారు. వీళ్ళను చూడగానే ఆ గుంపు ఆకస్మికంగా నిశ్శబ్దమైపోయింది.

ఉపాధ్యాయులు 'ఏమయిందేమయింది' అంటూ వాళ్ళను ప్రశ్నిస్తూ మరింత దగ్గరగా వచ్చారు.

"మీ హెడ్మాస్టర్‌ను ఎవరో కొట్టి, ఈ చెట్టు కింద పడేసి పొయ్యినారు సార్—మేము రోడ్డు పనికి పోతూ యిప్పుడే చూసినాము" అన్నారు కంగారుగా వాళ్ళు.

ఉపాధ్యాయులు 'అయ్యో' అంటూ వాళ్ళను తోసుకుని ముందుకు వచ్చి భయం భయంగా దారి పక్క తొంగి చూశారు.

కంప చెట్టు కింద పల్చటి నీడలో వెల్లకిలా పడి దెబ్బలతో మూలుగుతున్న హెడ్మాస్టర్.

ఆయన దీనంగా వీళ్ళ ముఖాలకేసి చూస్తూ సన్నటి స్వరంతో "బస్సు దిగి వస్తున్నాను. నలుగురు ఎదురు వచ్చి 'పోలీసుల్తో మమ్మల్ని కొట్టిస్తావా' అంటూ నన్ను కర్రలతో బాదేసి వెళ్ళి పోయారండీ! కాళ్ళను పచ్చడి పచ్చడి చేశారు" అన్నాడు బాధతో మూలుగుతూ—

ఆయన మూల్గులు, పరీక్షల మూలాల్ని కెలుకుతున్నట్టుగా తెరలు తెరలుగా వ్యాపిస్తున్నాయి.

పార్లమెంట్లో ఒక రోజు, రూలింగ్ పార్టీ పాలక ప్రతిపక్షాల మధ్య జనరల్ నాలెడ్జ్ క్విజ్ నడుస్తోంది. అపోజిషన్ పార్టీ ప్రశ్నలు అడగడం, రూలింగ్ పార్టీ సమాధానాలు చెప్పడం సాగుతోంది.

ఒక సభ్యుడి ప్రశ్న: రష్యా ప్రెసిడెంట్ ఎవరు?

ఓ మంత్రి: (పరధ్యానంగా లాల్చీ పైకి ఎత్తి కుడి వైపు వడికట్టును చూస్తూ) మైకేల్ గోర్బచెవ్ (సమాధానం ఇచ్చారు.)

మరో సభ్యుడి ప్రశ్న: అమెరికా ప్రెసిడెంట్ ఎవరు?

మరో మంత్రి గారి జవాబు: (జుబ్బా పైకి ఎత్తుకుని వడికట్టు కుడి వైపు చూస్తూ) జార్జ్ బుష్.

మూడో సభ్యుడి ప్రశ్న: జపాన్ ప్రధానమంత్రి ఎవరు?

మూడో మంత్రి: (ఈయునకు జవాబు తెలియలేదు. వాళ్ళలా గట్టెక్కాలనుకుని, తనూ లాల్చీ పైకి ఎత్తి వడికట్టు కుడివైపు చూస్తూ జవాబిచ్చాడు) "ఓంటెక్స్"

— రామం, వీణం, బెంగుళూరు.